ట్రంప్ మదిలో ఏముందో?

- జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు
- మారనున్న విధానాలపై సర్వత్రా ఆసక్తి.. ఆందోళన
- మొదటి రోజే సంచలన నిర్ణయాలకు సన్నద్ధం
- ఆర్థిక, వలస విధానాల్లో భారీ మార్పులకు అవకాశం
- రష్యా – ఉక్రెయిన్ యుద్ధంలోనూ కీలక పరిణామాలు?

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష పీఠాన్ని డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధిష్ఠించబోతున్నారు. జనవరి 20న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదంతో ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్.. అమెరికన్లకు భారీగా హామీలు ఇచ్చారు. దేశంలో అనేక సంస్కరణలు తీసుకొస్తానని, ఆర్థిక, వలస విధానాలను మార్చేస్తానని చెప్పారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ప్రకటించారు. తాను బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే మార్పులు ఉంటాయని చెప్పారు. అమెరికాలో జరిగే మార్పుల ప్రభావం మిగతా ప్రపంచమంతటిపై పడుతుంది. దీంతో ట్రంప్ తీసుకునే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి, ఒకింత ఆందోళన వ్యక్తమవుతున్నాయి.

–నేషనల్ డెస్క్





అక్రమ వలసదారులు వెనక్కు

ట్రంప్ హయాంలో అమెరికా వలస విధానాలు మరింత కఠినతరం అయ్యే అవకాశం ఉంది. ఆయన ఎన్నికల ప్రచారం ప్రధానంగా వలస విధానంపైనే సాగింది. అక్రమంగా వలస వచ్చిన లక్షలాది మందిని సొంత దేశాలకు పంపించేస్తానని చెప్పారు. అమెరికాలో దాదాపు 1.10 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉంటున్నారని 2022లో గుర్తించారు. ఇందులో 7.25 లక్షల మంది భారతీయులు ఉంటారని అంచనా. వీరిని బలవంతంగా అమెరికా నుంచి పంపించే అవకాశం ఉంది.

బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ బంద్

అమెరికాలో జన్మించే ప్రతి బిడ్డకు జన్మహక్కుగా పౌరసత్వం వచ్చేది. ఈ బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ విధానాన్ని తొలగిస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో పౌరసత్వం లేకుండా అమెరికాలో స్థిరపడ్డ వారి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం కాబోతున్నది. హెచ్1బీ వీసాలపై ఉన్న పరిమితులను మాత్రం తొలగించాలని ట్రంప్ శిబిరంలోని కొందరు ప్రతిపాదిస్తున్నారు. ఇది జరిగితే మాత్రం అమెరికాలో స్థిరపడాలనుకునే భారతీయులకు చాలా ప్రయోజనం జరుగుతుంది. అయితే, ఈ ప్రతిపాదనలను కొందరు ట్రంప్ మద్దతుదారులే వ్యతిరేకిస్తున్నారు.

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందా?

తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన 24 గంటల్లో రష్యా – ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు.త్వరలో పుతిన్‌తో సమావేశమై యుద్ధాన్ని ఆపడం కోసం చర్చలు జరుపుతానని సైతం ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఇదే జరిగితే ప్రపంచంలో నెలకొన్న కల్లోలం కొంత కుదుటపడటంతో పాటు ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరా భారం అమెరికాకు తగ్గుతుంది.

ప్రతీకార సుంకాలకు సై

అమెరికా నుంచి ఎగుమతి చేసే వస్తువులపై ఇతర దేశాలు భారీగా సుంకాలు వేస్తున్నాయని, తాను గెలిస్తే ప్రతీకార సుంకాలు వేస్తానని డొనాల్డ్ ట్రంప్ అనేకసార్లు ప్రకటించారు. తమ దేశ ఉత్పత్తులకు ఎక్కువ సుంకాలు వసూలు చేస్తున్న దేశాల ఉత్పత్తులపై తామూ పన్నులు వేస్తామని ఆయన ప్రకటించారు. దీంతో భారత్ సహా వివిధ దేశాల నుంచి అయ్యే ఎగుమతులపై ప్రభావం ఉండొచ్చు.

చైనాపై కఠిన వైఖరి?

చైనా ఉత్పత్తులపై డొనాల్డ్ ట్రంప్ కఠిన వైఖరి అవలంబించే అవకాశం ఉంది. తన ఎన్నికల ప్రచారంలో అనేక సార్లు ఈ విషయంలో ట్రంప్ ఆలోచన బయటపడింది. చైనా తయారీ దిగుమతులపై సుంకాలు, పరిమితులు విధించవచ్చు. ఇదే జరిగితే చైనాలోని పరిశ్రమలు భారత్, ఇండోనేషియా, వియత్నాం వంటి దేశాలకు వెళ్తాయని, తద్వారా ఈ దేశాల్లో తయారీరంగం పుంజుకుంటుందని సైతం పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

డాలర్ బలపడే అవకాశం

అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకుంటానని ట్రంప్ చెప్తున్న ఆర్థిక విధానాల వల్ల అమెరికా డాలర్ మరింత బలపడవచ్చు. డాలర్ విలువ బలపడితే మిగతా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. భారత్‌పైనా ఈ ప్రభావం ఉండొచ్చు. ముఖ్యంగా భారత్ చేసుకునే చమురు దిగుమతుల ఖర్చు పెరగొచ్చు.

కాలుష్య నివారణ చర్యలకు నష్టమే

2030 నాటికి అమెరికాలో విక్రయించే కొత్త కార్లు, ట్రక్కుల్లో 50 శాతం విద్యుత్తువే అయి ఉండాలని బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్ని రద్దు చేస్తానని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం ప్రపంచంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలకు ఎదురుదెబ్బ కావొచ్చని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. అమెరికాలో చమురు తవ్వకాన్ని సైతం భారీగా పెంచుతానని సైతం ట్రంప్ చెప్పారు. ఈ నిర్ణయమూ కాలుష్యానికి నష్టమే. అయితే, అమెరికాలో చమురు ఉత్పత్తి పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ తగ్గి, ధరలు తగ్గే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి.

ఫ్రాడ్ కాల్స్‌పై ఫిర్యాదులకు సంచార్ సాథీ

మొబైల్ యాప్ ప్రారంభించిన టెలికం శాఖ

న్యూఢిల్లీ: అనుమానాస్పద ఫ్రాడ్ కాల్స్‌పై మొబైల్ వినియోగదారులు నేరుగా తమ కాల్‌లాగ్స్ నుంచి ఫిర్యాదు చేసేందుకు వీలుగా టెలికం శాఖ(డీఓటీ) శుక్రవారం సంచార్ సాథీ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ యాప్‌తోపాటు డీఓటీకి చెందిన రెండు కొత్త ఆవిష్కరణలను ప్రారంభించారు. 2023లో సంచార్ సాథీ పోర్టల్‌ను డీఓటీ ప్రారంభించింది. తాజాగా మొబైల్ యాప్ తీసుకొచ్చింది. ప్రతి వినియోగదారుని గోప్యతను, భద్రతను ఈ యాప్ అందచేస్తుందని తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారాలలో లభించే ఈ కొత్త యాప్ అనుమానాస్పద ఫేక్‌కాల్స్, మెసేజ్‌ల గురించి కస్టమర్లు నేరుగా తమ మొబైల్ లాగ్స్ నుంచి రిపోర్ట్ చేయవచ్చు. అంతేగాక వినియోగదారులు తమ పేరిట జారీ అయిన మొబైల్ కనెక్షన్లను అన్నింటినీ గుర్తించవచ్చు. పోగొట్టుకున్న మొబైల్ హ్యాండ్‌సెట్లను బ్లాక్ చేయడం, కనిపెట్టడం, స్వాధీనం చేసుకోవడం వంటి ఫీచర్లు కూడా ఈ యాప్‌లో ఉన్నాయి. నాణ్యమైన మొబైల్ హ్యాండ్‌సెట్లను యూజర్లు కొనుగోలు చేసేందుకు వీలుగా హ్యాండ్‌సెట్ల నాణ్యతను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

కేబుల్ ఆపరేటర్ల నిబంధనలు సడలింపు

ఇక ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

న్యూఢిల్లీ, జనవరి 17: స్థానిక కేబుల్ టీవీ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించింది. రిజిస్ట్రేషన్ అధికారాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖకు అప్పగించడంతోపాటు స్థానిక కేబుల్ టీవీ ఆపరేటర్ల(ఎల్‌సీఓలు)రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ కిందకు ప్రభుత్వం మార్చింది. సవరించిన కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనలు–1994 శుక్రవారం నుంచే అమలులోకి వచ్చాయి. ఆధార్, పాన్, సిన్, డిన్‌తోపాటు ఇతర పత్రాలతో సహా దరఖాస్తును పరిశీలించిన తర్వాత రియల్ టైమ్‌లో స్థానిక కేబుల్ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

కొత్త సిమ్‌కార్డులకు ఆధార్ బయోమెట్రిక్ వెరిఫికేషన్ తప్పనిసరి

న్యూఢిల్లీ: కొత్త సిమ్‌కార్డులకు ఆధార్ బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్(డీఓటీ)కి ప్రధాన మంత్రి కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. రిటైలర్స్ ఈ ప్రక్రియను నిర్వహించకుండా సిమ్‌లను అమ్మడంపై నిషేధం విధించింది. ఈ నిబంధనలను ఉల్లంఘించేవారిని గుర్తించేందుకు కృత్రిమ మేధ సహకారం తీసుకోవాలని, దర్యాప్తు సంస్థలతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించింది. నకిలీ పత్రాల ద్వారా మొబైల్ కనెక్షన్స్‌ను పొంది, నేరాలు, మోసాలకు పాల్పడటానికి కళ్లెం వేయడం కోసం ఈ చర్యలు తీసుకుంది. గతంలో ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు వంటి పత్రాలను చూపించి, కొత్త సిమ్‌లను పొందేవారు.

ఈపీఎఫ్ ఖాతాలను ఉద్యోగులే బదిలీ చేసుకోవచ్చు!

ఉద్యోగం మారితే కొత్త సంస్థకి బదిలీ ప్రక్రియ సరళీకరణ

న్యూఢిల్లీ: ఉద్యోగి ఒక సంస్థ నుంచి మరొక సంస్థకి మారినపుడు ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాను కొత్త యాజమాన్యానికి మార్చుకోవడం ఇకపై సులభం కానుంది. ఈ ఖాతాల ఆన్‌లైన్ బదిలీ క్లెయిముల కోసం పాత, కొత్త యాజమాన్యాల మధ్య తిరగవలసిన అవసరం ఉండదు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ప్రకటించిన సంస్కరణల ప్రకారం, ఉద్యోగులు తమంతట తామే కొత్త యాజమాన్యానికి తమ ఈపీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకోవచ్చు. ఉద్యోగాలు మారేవారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా ఈపీఎఫ్ ఖాతాలను బదిలీ చేసుకోవడానికి అవకాశం కల్పించేందుకు ఈపీఎఫ్ఓ ఈ చర్యలు తీసుకుంది. దీనివల్ల పీఎఫ్ ట్రాన్స్‌ఫర్ ప్రాసెస్ మెరుగుపడుతుందని, జాప్యాలు తగ్గుతాయని ఈపీఎఫ్ఓ తెలిపింది. ఈపీఎఫ్ఓ పోర్టల్ ద్వారా మెంబర్స్ తమ పీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకోవచ్చు. యాజమాన్యాలపై ఆధారపడవలసిన అవసరం తగ్గుతుంది.

31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, జనవరి 17: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో జరగనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆమె బడ్జెట్‌ను సమర్పించడం ఇది వరుసగా ఎనిమిదోసారి. సంప్రదాయం ప్రకారం జనవరి 31న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రభుత్వం ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడుతుంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. బడ్జెట్ తర్వాత ఉభయ సభల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ తీర్మానంపై ప్రధాని సమాధానంతో మొదటి విడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి.

తెలంగాణ యువకుడికి ఎనిమిదేండ్ల జైలు

వైట్‌హౌస్‌పై దాడి యత్నం కేసులో కోర్టు తీర్పు

వాషింగ్టన్: అద్దెకు తీసుకున్న ట్రక్కుతో 2023 మే 22న వైట్ హౌస్‌పై దాడి చేసేందుకు యత్నించిన తెలంగాణ యువకుడు సాయి వర్షిత్ కందుల(20)కు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం అమెరికన్ కోర్టు తీర్పు చెప్పింది. ప్రజాస్వామికంగా ఎన్నికైన అమెరికన్ ప్రభుత్వాన్ని కూల్చి దానిస్థానంలో జర్మనీకి చెందిన నాజీ సిద్ధాంతంతో నియంతృత్వ పాలన తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ దాడి జరిగినట్టు అమెరికా న్యాయ శాఖ తెలిపింది. ఉద్దేశపూర్వకంగా గాయపరచడం లేదా అమెరికా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి తనపై వచ్చిన ఆరోపణలను 2024 మే 13న కందుల ఒప్పుకున్నట్టు న్యాయ శాఖ పేర్కొంది. జైలు శిక్ష పూర్తయ్యాక మరో మూడేళ్లు వర్షిత్ అధికారుల పర్యవేక్షణలో ఉండాల్సి వస్తుందని జిల్లా జడ్జి ఆదేశించారు.

హెచ్-1బీ నిబంధనల్లో భారీ మార్పులు

భారతీయ నిపుణులకు మరిన్ని అవకాశాలు

న్యూఢిల్లీ, జనవరి 17: హెచ్–1బీ వీసా నిబంధనల్లో అమెరికా భారీ మార్పులు చేసింది. తద్వారా అమెరికన్ కంపెనీలు మరింత తేలిగ్గా విదేశీ వృత్తి నిపుణులను నియమించుకునేందుకు వీలు కల్పించింది. అంతేకాకుండా ఎఫ్–1 విద్యార్థి వీసాలను సులువుగా హెచ్–1బీ వీసాలుగా మార్చుకునే వెసులుబాటు కల్పించింది. కొత్త నిబంధనలు శుక్రవారం (జనవరి 17) నుంచి అమల్లోకి వచ్చాయి. సమర్థులైన విదేశీ ఉద్యోగులకు మరిన్ని అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ సంస్కరణలను ప్రవేశపెట్టినట్టు స్పష్టమవుతున్నది. వీటితో అమెరికాలోని లక్షల మంది భారతీయ ఐటీ నిపుణులకు మరింత లబ్ధి చేకూరుతుంది. అగ్రరాజ్యంలో మంచి వేతనాలు లభించే కీలక ఉద్యోగాల్లో భారతీయులకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగులు తమ ఉద్యోగ స్థితి ఆధారంగా అమెరికాలో ఉండేందుకు అనుమతి లభిస్తుంది.

బెంగళూరులో అమెరికా కాన్సులేట్ ప్రారంభం

త్వరలో వీసా సేవలు

బెంగళూరు, జనవరి 17: అమెరికా తన కాన్సులేట్‌ను శుక్రవారం బెంగళూరులో ప్రారంభించింది. అమెరికా నిర్ణయాన్ని గణనీయమైన మైలురాయిగా అభివర్ణించిన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్.. టికీలు, వ్యాపార సందర్శకులు, విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరం కాగలదని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ కాన్సులేట్‌లో వీసా సర్వీసులు వెంటనే అందుబాటులో లేనప్పటికీ సాధ్యమైనంత త్వరలో ఆ సర్వీసులను తీసుకువస్తామని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటి ఈ సందర్భంగా తెలిపారు. వాణిజ్య, సైన్స్, టెక్నాలజీ, విద్య, సాంస్కృతిక రంగాలలో పరస్పర అవగాహన పెంపునకు ఇది దోహదపడగలదని ఆయన పేర్కొన్నారు. బెంగళూరులో ప్రారంభించిన అమెరికన్ కాన్సులేట్ దేశంలో ఐదవది. ప్రస్తుతం హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతాలో అమెరికా కాన్సులేట్ కార్యాలయాలు ఉన్నాయి.

రష్యా సైన్యంలోని 12 మంది భారతీయుల మృతి

16 మంది అదృశ్యం

విదేశాంగ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: రష్యా సైన్యంలో ఉన్న భారతీయులలో ఇప్పటి వరకు 12 మంది మరణించినట్టు తమ దృష్టికి వచ్చిందని విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇటీవల రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో మరణించిన కేరళకు చెందిన వ్యక్తి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తున్నట్టు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం తెలిపారు. గాయపడిన మరో వ్యక్తికి చికిత్స జరుగుతున్నట్టు చెప్పారు. రష్యా సైన్యంలో ఇంకా 18 మంది భారతీయులు ఉన్నారని, వారిలో 16 మంది ఆచూకీ తెలియడం లేదని ఆయన వెల్లడించారు. తమ దృష్టికి వచ్చిన మొత్తం 126 మందిలో 96 మంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చేశారని చెప్పారు.

కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ఆమోదం

టెల్ అవీవ్: హమాస్–ఇజ్రాయెల్ యుద్ధంలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను హమాస్ ఇజ్రాయెల్‌కు అప్పగిస్తుంది. అదేవిధంగా, తమ జైళ్లలో ఉన్న పాలస్తీనీయులను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. ఈ గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదం కోసం పంపిస్తారు. బందీల్లో తొలి బృందాన్ని ఆదివారం విడుదల చేయడంతో ఈ ఒప్పందం అమల్లోకి వస్తుంది.

ఆర్‌టీఐ పరిధిలోకి ప్రైవేట్ దవాఖానలు!

సీఐసీ సూచన

న్యూఢిల్లీ: ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన తర్వాత ప్రైవేట్ దవాఖానల లైసెన్సులను రెన్యువల్ చేసే పద్ధతులను నిలిపివేయాలని ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) సూచించింది. అత్యవసర ప్రజా సేవలను అందజేసే ప్రైవేట్ దవాఖానలను కూడా సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) పరిధిలోకి తీసుకురావలసి ఉందని సమాచార హక్కు కమిషనర్(సీఐసీ) వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. 2023లో తన భార్యకు చికిత్స అందజేసిన ఓ ప్రైవేట్ దవాఖాన విపరీతంగా బిల్లులు వేసిందని, ఆర్టీఐ కింద దాని లైసెన్స్ వివరాలు తనకు ఇవ్వలేదని ఆరోపిస్తూ ఓ ఆర్‌టీఐ దరఖాస్తుదారుడు వేసిన కేసు విచారణ సందర్భంగా సీఐసీ ఈ వ్యాఖ్యలు చేశారు.

క్యారీ బ్యాగ్‌కు 18 వసూలు.. 35 వేలు జరిమానా

న్యూఢిల్లీ: 'సంచి లాభం చిల్లు తీర్చింది' అని తెలుగులో ఉన్న సామెతను నిజం చేస్తూ క్యారీ బ్యాగ్ ఇచ్చి రూ.18 వసూలు చేసిన ఒక వ్యాపార సంస్థకు రూ.35 వేల జరిమానా పడింది. ఒక షర్ట్‌ను కొన్న కొనుగోలుదారుడికి ఇచ్చే క్యారీబ్యాగ్‌కు రూ.18 వసూలు చేసిన ఒక రిటైల్ చైన్ స్టోర్‌కు లక్నో వినియోగదారుల న్యాయస్థానం రూ.35 వేల జరిమానా విధించింది. ఇందులో అతడు చెల్లించిన రూ.18కు 9 శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలని, రూ.25 వేలు ఆయన అనుభవించిన మానసిక వేదనకు నష్టపరిహారంగా, మిగిలినది కోర్టు, ఇతర ఖర్చులకు ఇవ్వాలని ఆదేశించింది. ఆ వ్యాపార సంస్థ కొనుగోలుదారునికి లోపభూయిష్టమైన సేవలు అందించడమే కాక, అతనిపట్ల అనుచితంగా ప్రవర్తించిందని కోర్టు వ్యాఖ్యానించింది. శశికాంత్ శుక్లా అనే వ్యక్తి 2023లో లక్నోలోని ఒక పెద్ద స్టోర్‌లో ఒక షర్ట్ కొన్నప్పుడు ఈ కేసు నమోదైంది.

దాడి తర్వాత దుస్తులు మార్చుకొని!

- బాంద్రా స్టేషన్‌లో సైఫ్‌పై దాడి చేసిన నిందితుడు
- ఉదయం వరకు అక్కడే

ముంబై: తన అపార్ట్‌మెంట్‌లో దుండగుడి చేతిలో కత్తిపోట్లకు గురైన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కోలుకుంటున్నారు. 54 ఏండ్ల సైఫ్‌పై కత్తితో దాడి చేసిన దుండగుడు గురువారం ఉదయం 8 గంటల వరకు బాంద్రా స్టేషన్‌లోనే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పరారైన తర్వాత నిందితుడు తన చొక్కాను మార్చుకుని నీలం రంగు షర్ట్‌ను ధరించి, భుజాన బ్యాగ్‌తో కన్పించాడు. కాగా, ఈ కేసులో పోలీసులు వారిస్ అలీ సల్మానీ అనే కార్పెంటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు సైఫ్ ఫ్లాట్‌లో రెండు రోజుల క్రితం పనిచేశాడు. దుండగుడి ఆచూకీ కోసం 20 పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. కాగా, సైఫ్ ఆరోగ్యం బాగుందని, 3 రోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.

పట్టపగలు బ్యాంకు చోరీ

- మంగళూరులో సిబ్బందిని బెదిరించి బంగారం దోపిడీ
- కర్ణాటకలో మరోసారి రెచ్చిపోయిన దొంగలు
- బీదర్ కాల్పుల ఉదంతాన్ని మరువకముందే మరో ఘటన

మంగళూరు, జనవరి 17: కర్ణాటకలో దొంగలు రెచ్చిపోతున్నారు. గురువారం బీదర్‌లో ఏటీఎంకు డబ్బులు తీసుకెళ్లే వాహనంపై కాల్పులు జరిపి 98 లక్షలు ఎత్తుకెళ్లిన ఘటనను మరువక ముందే, శుక్రవారం మంగళూరు నగరంలో దుండుగులు పట్టపగలు బ్యాంకులో చోరీకి పాల్పడ్డారు. కోటెకర్‌లో ఉన్న సహకార సంఘం బ్యాంకులో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య ముసుగులు ధరించిన ఐదుగురు దొంగలు బ్యాంకులోకి దూసుకొచ్చారు. పిస్టల్, కత్తులతో బ్యాంకు సిబ్బందిని బెదిరించి బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్న లాకర్‌ను తెరిపించారు. వాటిని కాజేసి నీలం రంగు ఫియట్ కారులో ఉడాయించారు. ఘటన జరిగినప్పుడు బ్యాంకులో ఐదుగురు సిబ్బంది ఉన్నారు. సెక్యూరిటీ సిబ్బంది లేరు. దోపిడీకి గురైన సొత్తు విలువ రూ.4 కోట్లు ఉంటుందని తేలింది. గురువారం బీదర్‌లో ఏటీఎంలకు డబ్బులు తీసుకెళ్లే వాహనంపై దొంగలు కాల్పులు జరిపి రూ.93 లక్షలు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. దొంగల కాల్పుల్లో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు సైతం మరణించడం సంచలనం రేపింది. ఈ ఘటన జరిగిన మరునాడే బ్యాంకు దోపిడి జరగడంతో కర్ణాటక పోలీసుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యమంత్రి నగరంలో ఉండగానే..

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మంగళూరు నగరంలో ఉండగానే ఈ దోపిడీ జరగడం గమనార్హం. ఈ సంఘటన గురించి తెలుసుకున్న సీఎం.. పోలీసు అధికారులతో వెంటనే సమావేశమయ్యారు. ఇంత మంది పోలీసులు ఉన్నా దొంగలు ఎలా పారిపోయారని ఆయన ప్రశ్నించినట్టు సమాచారం. వెంటనే నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. దొంగలను పట్టుకునేందుకు నాలుగు జిల్లాల్లో పోలీసులు గాలింపు మొదలుపెట్టారు.

ముడా స్కామ్‌లో 300 కోట్ల ఆస్తుల అటాచ్

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య నిందితుడిగా ఉన్న కేసులో ఈడీ కీలక చర్యలు
- 140 స్థిరాస్తులు అటాచ్
- స్కామ్‌లో సిద్ధరామయ్య భార్యకు అనుచిత లబ్ధి
- రూ.3.24 లక్షల భూమికి 56 కోట్ల పరిహారం

న్యూఢిల్లీ, జనవరి 17: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిందితుడిగా ఉన్న మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసుపై ఈడీ కీలక ప్రకటన చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి చెందిన 140 స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం ప్రకటించింది. వీటి విలువ రూ.300 కోట్లు ఉంటుందని తెలిపింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లుగా పని చేస్తున్న వారి పేర్లతో ఈ ఆస్తులు ఉన్నట్టు చెప్పింది. ఈ కేసుకు సంబంధించి సోదాలు జరిపినప్పుడు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలే కాకుండా ఇంకా భారీగా అక్రమాలు జరిగాయని గుర్తించినట్టు ఈడీ తెలిపింది. తక్కువ విలువైన భూములకు పరిహారం రూపంలో అనేక ఖరీదైన స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ముడా అప్పగించిందని వెల్లడించింది. బినామీల పేర్లతో ఈ స్థలాలను పొందిన వ్యాపారులు వీటిని అమ్మేసి భారీగా అక్రమ నగదును పొందారని చెప్పింది. ఇందుకు బదులుగా అప్పటి ముడా చైర్మన్, కమిషనర్‌కు స్థిరాస్తులు, ముడా స్థలాలు, నగదు రూపంలో లంచాలు చెల్లించినట్టు ఆధారాలు లభించాయని తెలిపింది.

సిద్ధరామయ్య భార్యకు భారీగా లబ్ధి

ముడా భూకుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణికి భారీ లబ్ధి కలిగిన విషయాన్ని కూడా ఈడీ స్పష్టం చేసింది. సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి నుంచి ముడా 3 ఎకరాల 16 గుంటల భూమిని మొదట రూ.3,24,700కు సేకరించిందని తెలిపింది. ఆ తర్వాత ఖరీదైన ప్రాంతంలో 14 స్థలాలను పరిహారంగా ఇచ్చిందని, వీటి విలువ రూ.56 కోట్లు ఉంటుందని వెల్లడించింది. కాగా, సిద్ధరామయ్య తన పలుకుబడిని ఉపయోగించి ఇలా ఖరీదైన స్థలాలను పరిహారంగా దక్కేలా చేశారనే ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే సిద్ధరామయ్యను కర్ణాటక లోకాయుక్త పోలీసులు సైతం విచారించారు.

16కి పెరిగిన నక్సల్స్ మృతుల సంఖ్య

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 17: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారీ కాంకేర్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 16కి చేరింది. బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల డీఆర్‌జీ జవాన్లతో పాటు కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సుమారు 1,500 మంది బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. దీంతో మావోయిస్టులు తలపెట్టిన భారీ ప్లీనరీ భగ్నమైనట్లు తెలుస్తున్నది. మృతిచెందిన వారిలో సోంబేడి అలియాస్ సోమిడి(ఏసీఎం డిప్యూటీ కమాండర్), కిశోర్(ఏసీఎం), లాలు(పార్టీ సభ్యుడు), సోని(ఏసీఎం), మున్న, హిడుమా అలియాస్ ఇడుమ అలియాస్ ఇర్మ, సాంట అలియాస్ శ్వేత, గంగి(ఏసీఎం), కోవాసి, రత్న, కుసబ అలియాస్ కేశవ, అండాలు(పార్టీ సభ్యురాలు), దవాజ అలియాస్ రజిత(పార్టీ సభ్యురాలు), శాంతి(పార్టీ సభ్యురాలు), మైను అలియాస్ సాంబు, రాములు అలియాస్ రాములు(పార్టీ సభ్యుడు) ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.